క్లుప్తంగా

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

కర్నూలు(అర్బన్): నటరత్న, నట సార్వభౌమ, పద్మశ్రీ, డా.ఎన్టీ రామారావుకు బ్రాహ్మణ నేతలు ఘనంగా నివాళి అర్పించారు. మంగళవారం రామారావు 101వ జయంతి సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి బ్రాహ్మణ సంక్షేమ సేవా మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్, అర్చక సమాఖ్య అధ్యక్షుడు టీవీ రవిచంద్రశర్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళా రంగానికి స్వర్గీయ ఎన్టీ రామారావు ఎనలేని సేవలు చేశారని, తెలుగు కీర్తిని ప్రపంచమంతా చాటిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

కర్నూలు : మాజీ ఎమ్మెల్సీ స్వర్గీయ చల్లా భగీరథ్‌రెడ్డి 48వ జయంతిని పురస్కరించుకుని నగరంలోని వృద్ధాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మ వృద్ధాశ్రమం, మనం వృద్ధాశ్రమం, అభయగిరి మెర్సీ హోంలో కుష్టు రోగులు, వివిధ వ్యాధిగ్రస్తులతో పాటు వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో చల్లా విక్రాంత్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ గుడిపల్లి సురేందర్, చల్లా సురేందర్‌రెడ్డితో పాటు చల్లా అభిమానులు షాకీర్ హుసేన్, ఆరిఫ్ హుసేన్, జాకిర్ హుసేన్, శివ, షేక్ ఖదీర్, సురేంద్ర, నాగార్జున పాల్గొన్నారు.

దాడులను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి జి.శ్రీనివాసరెడ్డి

కర్నూలు(సెంట్రల్): సమాజంలో హిందూ ధర్మంపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి జి.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ఇండస్ స్కూలులో జరుగుతున్న బజరంగ్ దళ్ ప్రశిక్షణవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశాన్ని ఉత్తర, దక్షిణాలుగా విడదీసే కుట్ర జరుగుతోందన్నారు. అంతేకాక భారతదేశ సంస్కృతి, కళలపై కూడా దాడి జరుగుతోందన్నారు. వీటిని యువత తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కోకన్వీనర్ పోలేపల్లి సుందీప్, వీహెచ్‌పీ జిల్లా సహ కార్యదర్శి ఈవూరి నాగరాజు, బజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకులు సి.రవికుమార్, పెంచల్ రెడ్డి, కమ్మయ్య, పిచ్చయ్య చౌదరి పాల్గొన్నారు.

పేద ప్రజలకు ఉచిత వైద్యసేవలు



మాట్లాడుతున్న నూతిబాపయ్య

కర్నూలు(సెంట్రల్): పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం కృషి చేస్తుందని ఆ సంఘం అధ్యక్షుడు నూతి బాపయ్య(బాపు) పేర్కొన్నారు. మంగళవారం సుర్జీత్‌భవన్‌లో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో అనేక సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సుశీలా నేత్రాలయ, మైత్రీ హాస్పిటళ్లకు చెందిన వైద్యులు రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం జిల్లా చైర్మన్ కె.ప్రభాకరరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు ప్రదానం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు సరళమ్మ

పాణ్యం: మండల పరిధిలోని కొండజుటూరు గ్రామంలో సీఎస్ఐ చర్చి ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన ఎండ్ల బండలాగుడు పోటీలు మంగళవారం ముగిశాయి. గెలుపొందిన వృషభాల యజమానులకు జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి ప్రకాశం జిల్లా పీఎస్‌కే వృషభాలు రూ.60 వేలు, రెండో బహుమతి కొండజుటూరు సద్దల సూర్యనారాయణరెడ్డి ఎడ్లు రూ. 50 వేలు, మూడో బహుమతి వైఎస్సార్ జిల్లా ఎంవీఎస్ఆర్ రూ.40 వేలు, నాల్గో బహుమతి వైఎస్సార్ జిల్లా సకమ్ బుల్స్ రూ. 30 వేలు, ఐదో బహుమతి అనంతపురం జిల్లా శ్రీరాములు ఎడ్లు రూ. 20 వేలు, ఆరో బహుమతి ప్రకాశం జిల్లా యూఎస్ఆర్ వృషభాలు రూ.10 వేలను కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి, రచనారెడ్డి, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

టేబుల్‌కు ఒక ఏజెంట్

- కౌంటింగ్ ఏజెంట్ల కోసం 30లోపు దరఖాస్తు చేసుకోవాలి
- పాణ్యం నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య





సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య, హాజరైన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు తమ తరపున ఓట్ల లెక్కింపు సమయంలో ఒక్కో టేబుల్‌కు ఒక ఏజెంట్‌ను నియమించుకోవచ్చునని పాణ్యం నియోజకవర్గ ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై రాజకీయపార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పాణ్యం నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌ను రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ బ్లాక్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు తమ తరపున కౌంటింగ్ ఏజెంట్ల కోసం 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు తన కార్యాలయంలో సమర్పించాలని జేసీ సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం 6 టేబుళ్లు, ఈవీఎంలలో ఓట్ల కౌంటింగ్ కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కౌంటింగ్ హాలులోకి ఏజెంట్లు సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లడానికి అనుమతి ఉండదన్నారు. ఈ విషయాన్ని అందరికీ తెలియజేయాలని ఆమె సూచించారు. టౌన్ డీఎస్పీ విజయశేఖర్ మాట్లాడుతూ..కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా చేపట్టేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా సంబంధిత వ్యక్తులకు తీవ్ర మైన శిక్ష తప్పదన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, మూడు దశల్లో కౌంటింగ్ కేంద్రాలకు భద్రత ఉంటుందన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్దకు అనుమతులు ఉన్న వాహనాలనే పంపుతామన్నారు. బాణాసంచా పేల్చడం, ర్యాలీలు, సభల నిర్వహణకు కౌంటింగ్, ఆ మరుసటి రోజుల్లో నిషేధం విధించినట్లు చెప్పారు. కేటాయించిన ప్రదేశాల్లోనే వాహనాలను పార్కింగ్ చేసి పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు తహసీల్దార్ మునివేలు, పాణ్యం తహసీల్దార్ ఫణికుమార్, ఓర్వకల్ తహసీల్దార్ నటరాజ్, గడివేముల తహసీల్దార్ జమానుల్లాఖాన్‌తోపాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద డ్రెస్ రిహార్సల్

కర్నూలు (టౌన్) : వచ్చే నెల 4 వ తేదీ నగర శివారులోని రాయలసీమ యూనివర్సిటీలో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరుగనున్న నేపథ్యంలో మంగళవారం రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ డ్రెస్ రిహార్సల్ నిర్వహించారు. కౌంటింగ్ సిబ్బందితో కలిసి కౌంటింగ్ ప్రక్రియ గురించి ఆరా తీశారు. టేబుళ్లు, కంప్యూటర్లు, ఇంటర్‌నెట్ సదుపాయాలను పరిశీలించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. రిహార్సల్‌లో ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణీ, నగరపాలక అదనపు కమిషనర్ రామ లింగేశ్వర్, మున్సిపల్ ఆరోగ్య శాఖ అధికారి విశ్వేశ్వర రెడ్డి, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



కౌంటింగ్ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ

డిగ్రీ పరీక్షల్లో ఆరుగురు డీబార్

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం ఆరుగురు డీబార్ అయ్యారు. నందికొట్కూరు శ్రీసాయిరామ్ డిగ్రీ కాలేజీలో ఒకరు, శ్రీశైలం గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో ఒకరు, ఎమ్మిగనూరు సిద్ధార్థ డిగ్రీ కాలేజీలో ముగ్గురు, నందికొట్కూరు బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కాలేజీలో ఒకరు మొత్తం ఆరుగురు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుండడంతో అధికారులు డీబార్ చేశారు. కాగా, రెండో సెమిస్టర్‌కు 90 శాతం, నాలుగో సెమిస్టర్‌కు 88 శాతం మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారు.

90 శాతం రాయితీతో ఎరువులు అందించాలి

కల్లూరు: ఖరీఫ్ సీజన్‌లో సాగుకు సరిపడా అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు 90 శాతం సబ్సిడీతో రైతులకు అందించాలని ఏపీ రైతు సంఘం కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మునివేలుకు వినతి పత్రం అందజేశారు. రైతులు నకిలీ విత్తనాలతో నష్టపోతున్నారన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మే దుకాణ యజమానులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల్లో నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఆయనతో పాటు రైతు సంఘం నాయకులు రామదాసు, సువర్ణ, సత్యాలు, రామాచారి పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో పలు విభాగాలు అభివృద్ధి



మాట్లాడుతున్న హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో తాను సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టినప్పటినుంచి ఇప్పటి వరకు పలు విభాగాలను అభివృద్ధి చేసినట్లు డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి చెప్పారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరీ హాల్‌లో హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. 2022 ఆగస్టు నుంచి 2023 జులై వరకు 22,791 కేసులు నిర్వహించగా ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు 27,998 కేసులు నిర్వహించామన్నారు. ఆరోగ్యశ్రీలో ఇచ్చిన లక్ష్యాలను ఆయా విభాగాల వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారని కొనియాడారు. ఈ-హాస్పిటల్ అమలులోనూ విశేష పురోగతి సాధించినట్లు పేర్కొన్నారు. పలు విభాగాలకు అవసరమైన అత్యాధునిక వైద్యపరికరాలు కావలసిన యంత్రాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇందులో అనస్థీషియా వర్క్ స్టేషన్లు, ఈసీజీ మిషన్లు, లారింగోస్కోప్‌లు, బీపీ ఆపరేటర్లు, పాంటమ్ ప్రింటర్లు, థర్మోస్కోపిక్ మెనిస్ లేజర్ ఫైబర్ ఓటీ లైట్లు, సెమీ ఆటోమేటిక్ ఆటోక్లేవ్‌లు, ఈటీఓ స్టెరిలైజర్లు, డయాథర్మీ యూనిట్, కంప్యూటర్ టేబుళ్లు, గ్యాస్ట్రోస్కోప్, వీడియో డ్యూడెనో స్కోప్, డెక్సా స్కాన్, అల్ట్రా సౌండ్ మిషన్లు, ట్రాలీలు, ఏసీలు, పోర్టబుల్ వెంటిలేటర్లు, సిలికాన్ రెసస్సీటేటర్ కిట్లు, కుర్చీలు, స్ట్రెచర్లు ఉన్నాయన్నారు. ఇందుకు సంబంధించి ఆయన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. సమావేశంలో కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన పెరగాలి



రుతుక్రమ జాగ్రత్తలపై అవగాహన కరపత్రాలు ప్రదర్శిస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రవీణ్‌కుమార్, వైద్య సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): రుతుక్రమ పరిశుభ్రత పట్ల బాలికలు అవగాహన పెంచుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఎన్టీఆర్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని 2013 మే 28న జర్మనికి చెందిన వాష్ యునైటెడ్ అనే ఎన్‌జీఓ ప్రారంభించిందన్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం పీరియడ్ ఫ్రెండ్లీ వరల్డ్ అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెలసరి అనేది సాధారణంగా 9 నుంచి 14 సంవత్సరాల వయస్సు అమ్మాయిల్లో మొదలవుతుందన్నారు. దాదాపుగా ప్రతి నెలా 3 నుంచి 5 రోజుల పాటు రజస్వల అవుతుందన్నారు. ఇది వయస్సు పెరుగుదలలో భాగంగా జరిగే సహజ ప్రక్రియ అని, అమ్మాయిలకు అవగాహన కల్పించి ఆందోళనకు గురికాకుండా చూడాలని తెలిపారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత మాట్లాడుతూ అమ్మాయిలు నెలసరి సమయంలో చేయాల్సిన విధుల గురించి వివరించారు. ప్రతిరోజూ స్నానం చేయాలని, ప్రతి ఆరు గంటలకు ఒకసారి శానిటరి ప్యాడ్ మార్చుకోవాలని, వాడిన శానిటరి ప్యాడ్‌ను పేపర్లో చుట్టి డస్ట్‌బిన్‌లో వేయాలని, ప్యాడ్ మార్చుకునే ముందు, తర్వాత చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని, వాడిన లోదుస్తులను ఉతికి ఎండలో ఆరబెట్టాలని, పోషకాహారం తీసుకోవాలని, వీలైనంత ఎక్కువగా నీరు తాగాలని, తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ విషయాలపై క్షేత్రస్థాయిలో ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు కిశోరబాలికలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డెమో ప్రమీలాదేవి, హెచ్‌ఈఈఓ శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌బీఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున, మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

- స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు డీఎంహెచ్‌ఓ హెచ్చరిక
- అమృత హాస్పిటల్ స్కానింగ్ కేంద్రం తనిఖీ



స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న అమృత హాస్పిటల్‌లోని స్కానింగ్ కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రంలో క్రమం తప్పకుండా ఫారమ్-ఎఫ్ రిపోర్ట్సు పీసీ పీఎన్‌డీటీ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, లింగనిర్ధారణ నేరం అని సూచించే బోర్డు ఏర్పాటు చేయాలని, లేనిచో పీసీ పీఎన్‌డీటీ చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని నిర్వాహకులకు హెచ్చరించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో నిర్వహించే ప్రతి కాన్పు వివరాలను డెలివరి రిజిస్టర్‌లో, సురక్షిత గర్భస్రావాలు(ఎంటీపీ)ను ఎంటీపీ రిజిస్టర్‌లో, అప్పుడే జన్మించిన బిడ్డకు ఇచ్చిన వ్యాధినిరోధక టీకాల వివరాలను టీకాల రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అంతేగాక ఆసుపత్రిలో నిర్వహించే కాన్పులలో మొదట వీలైనంత వరకు సాధారణ కాన్పు జరిగేటట్లు ప్రయత్నం చేయాలని, అలాకాని పక్షంలో మాత్రమే సిజేరియన్ కాన్పు నిర్వహించాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించిన ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట డెమో ప్రమీలాదేవి, హెచ్ఈఈవో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, మానటరింగ్ కన్సల్టెంట్ సుమలత ఉన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు

కల్లూరు: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దే వైద్య సేవలు అందిస్తున్నట్లు కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ మోతీలాల్ నాయక్ అన్నారు. మంగళవారం కల్లూరు మండలం బస్తిపాడు గ్రామ సచివాలయ పరిధిలోని చిన్నకొట్టాల గ్రామంలో వైద్య సేవలు అందించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం గ్రామంలో ప్రపంచ నెలసరి పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మహిళలకు శుచి శుభ్రత గురించి వివరించారు. ప్రతి ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్) కనీసం పది ఇళ్లను సందర్శించి నెలసరి పరిశుభ్రత గురించి మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ సాయికుమారి, ఏఎన్ఎం నాగపద్మ, పాల్గొన్నారు.

తక్కువ వడ్డీ రేట్లతో రుణాలు



రుణ మంజూరు పత్రాలు అందజేస్తున్న యూబీఐ రీజినల్ హెడ్ నరసింహారావు

కర్నూలు(అగ్రికల్చర్): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యుబిఐ) తక్కువ వడ్డీ రేట్లతో హౌసింగ్, విద్య, వెహికల్ రుణాలు పెద్ద ఎత్తున పంపిణీ చేస్తున్నట్లు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి.నరసింహరావు తెలిపారు. మంగళవారం యుబిఐ రీజనల్ కార్యాలయం తరపున స్థానిక అశోక్ నగర్ బ్రాంచీ ప్రక్కన రీటైల్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్డర్లు, కారు డీలర్లు, సోలార్ డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. రీటైల్ ఎక్స్‌పోను ప్రారంభించిన రీజినల్ హెడ్, ఏజీఎం నరసింహారావు మాట్లాడుతూ ఈ రుణాలు కర్నూలు నగరంలోని 15 శాఖల ద్వారా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రీమియర్ ఎడ్యుకేషనల్ కాలేజీల్లో చేరే విద్యార్థులకు రూ.40 లక్షల వరకు విద్యా రుణాలు ఇస్తామన్నారు. ఈ సందర్భంగా 15 మందికి అక్కడికక్కడే రుణ మంజూరు పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ హెడ్ సురేంద్రగౌడు, రీటైల్ లోన్ హెడ్ కే.శ్రీనాథ్‌రెడ్డి, నగరంలోని వివిధ బ్రాంచీల మేనేజర్లు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఏపీడీ లక్ష్మన్న

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలని ఏపీడీ లక్ష్మన్న అన్నారు. మంగళవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో సాంకేతిక, క్షేత్రస్థాయి సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మన్న మాట్లాడుతూ.. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం పండ్ల తోటల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయి సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మండలానికి సంబంధించి 500 ఎకరాలను కేటాయించినట్లు తెలిపారు. ఈ లక్ష్యాన్ని అధిగమించాలంటే క్షేత్రస్థాయికి వెళ్లి 5 ఎకరాల్లోపు చిన్నకారు, సన్నకారు రైతుల జాబితాను తయారు చేయాలన్నారు. పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులకు మొక్కలతో పాటు మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులను ప్రభుత్వమే చెల్లిస్తుందని పేర్కొన్నారు. పండ్ల రకాలను బట్టి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు మూడేళ్ల కాలంలో చెల్లిస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఈసీ మధువెంకటకృష్ణ, సాంకేతిక సహాయకులు, క్షేత్రస్థాయి సహాయకులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ బందోబస్తు



వాహనాల పార్కింగ్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

పాణ్యం: జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీ బందోబస్తు చేపడుతున్నట్లు ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఆర్‌జీఎం, శాంతిరామ్ ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతను తనిఖీ చేశారు. ఎన్నికల కౌంటింగ్ సమయం దగ్గర పడుతున్న సమయంలో సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆయన కౌంటింగ్ రోజు వాహనాల పార్కింగ్‌కు అనువైన ప్రదేశాలను స్థానిక అధికారులతో కలిసి పరిశీలించి అధికారులు సూచనలు, సలహాలు ఇచ్చారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అనుమానాస్పదంగా ఎవరు కనిపించిన పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఫలితాలు వెలువడిన అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా పేల్చేందుకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. ప్రజలందరూ వివాదాలకు అల్లర్లకు దూరంగా ఉండాలన్నారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా జిల్లా వ్యాప్తంగా పోలీసు పికెట్లు, మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, టౌన్ డీఎస్పీ రవీంద్రనాథరెడ్డి, అర్మ్‌డు రిజర్వ్ డీఎస్పీ శ్రీనివాసులు, నంద్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, పాణ్యం ఇన్‌స్పెక్టర్ నల్లప్ప ఉన్నారు.

చౌడు భూములను బాగు చేసుకుందాం

- తగిన జాగ్రత్తలతో చౌడు భూముల్లో మంచి పంటలు
- జిల్లాలో కారు చౌడు నేలలే ఎక్కువ
- వీటికి నీరు ఇంకే స్వభావం ఉండదు
- ఇలాంటి నేలలను బాగు చేసుకునేందుకు ఇదే అదును
- కర్నూలు ఏడీఏ సాలురెడ్డి సూచనలు

రైతులు ఖరీఫ్ సీజన్‌లో పంట సాగుకు సన్నద్ధమవుతున్నారు. పొలాలను దుక్కులు చేసుకుని సిద్ధం చేసుకుంటున్నారు. అయితే జిల్లాలో చౌడు భూములు ఎక్కువగా ఉన్నాయి. ఈ భూములను సాగు యోగ్యంగా చేసుకోవడానికి వేసవి చక్కటి అదును. ఈ నేలలకు నీరు ఇంకే స్వభావం తక్కువగా ఉంటుంది. పంటల సాగుకు కలసిరావు. ఏ పంట వేసినా దిగుబడులు అంతంతమాత్రంగానే ఉంటాయి. తగిన జాగ్రత్తలు తీసుకుంటే చౌడు భూములను సాగు భూములుగా మార్చుకోవడానికి అవకాశం ఉంటుంది.



ఏడీఏ సాలురెడ్డి



కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని పలు ప్రాంతాల్లో చౌడు భూములు ఎక్కువగా ఉన్నాయి. ప్రధానంగా కర్నూలు, ఆదోని డివిజన్‌లోని అన్ని మండలాల్లో కనిపిస్తుంటాయి. ఈ భూముల్లో పంటలు వేసినా దిగుబడులు పెద్దగా ఉండవు. రైతులు నష్టపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. చౌడు భూముల్లో మంచి పంటలు పండించడానికి రైతులు పలు జాగ్రత్తలు తీసుకుంటే మంచి ఫలితాలు పొందొచ్చు. కొద్దిపాటి శ్రమ, పెట్టుబడితో భూముల్లో చౌడు శాతాన్ని తగ్గించుకుని వివిధ పంటలు సాగుచేసుకోవచ్చు. రసాయన ఎరువులు విచ్చలవిడిగా వాడడం వల్ల భూములు చౌడుబారుతాయి. ఇలాంటి భూములను ఏ విధంగా అభివృద్ధి చేసుకోవచ్చో కర్నూలు సబ్ డివిజన్ సహాయ సంచాలకులు సాలురెడ్డి మాటల్లో..

చౌడు నేలల్లో రకాలు

చౌడు నేలల్లో సాధారణంగా మూడు రకాలు ఉంటాయి. పాల చౌడు నేలలు, పాలకారుచౌడు నేలలు, కారుచౌడు నేలలు ఉన్నాయి. జిల్లాలో ప్రధానంగా కారుచౌడు నేలలు ఎక్కువగా ఉన్నాయి. కారుచౌడు నేలల్లో సోడియం అనే ధాతువు అధికంగా ఉంటుంది. దీనివల్ల ఉదజని సూచిక పెరుగుతుంది. ఈ నేలల్లో వేసవి కాలంలో పైన నలుపు లేక బూడిద రంగు పొరను చూడవచ్చు.

చౌడు నేలలు..సమస్యలు

- ఈ రకం నేలలకు నీరు ఇంకే స్వభావం తక్కువగా ఉంటుంది. వ్యవసాయ పనులు సులువుగా, సవ్యంగా జరగవు. నేలలో ఉండే సూక్ష్మ జీవకోటి ఎక్కువ మోతాదులో ఉండదు. సేంద్రియ పదార్థం తక్కువగా ఉంటుంది.
- ఎంత ఎరువు వేసినా, ఎంత నీరు పారించినా చౌడు నేలల్లో పైరు సరిగ్గా మొలవదు. పంట పీడలకు సులువుగా లోనవుతుంది. మిగిలిన నేలల్లో మాదిరిగా పంట సరిగ్గా పెరగదు. పైరు పొట్టిగా ఉంటుంది. ఫలసాయం తక్కువగా ఉండడమే కాకుండా నాణ్యత లేకుండా ఉంటుంది.
- ఇలాంటి నేలలను బాగుచేసుకుంటే విలువైన నేల, నీరు, ఎరువులు సద్వినియోగం అవుతాయి. పెరుగుతున్న జనాభా ఆహార సమస్యపరంగా చూసినా, రైతు ఆర్థిక పరిస్థితి గమనించినా చౌడు నేలలను బాగు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇలా బాగుచేయవచ్చు

- ఈ నేలల్లో సోడియం అనే ధాతువు ఎక్కువగా ఉంటుంది. దీన్ని తగ్గించాల్సిన అవసరం ఉంది. మంచి నాణ్యత కలిగిన నీరు, జిప్సమ్ ఉపయోగించడం వల్ల సోడియాన్ని తగ్గించవచ్చు. రైతులు చౌడు నేలలను బాగుచేయాలనుకుంటే మొదట భూసార పరీక్ష చేయించాలి.
- భూసార పరీక్షలో చౌడు ఎంత శాతం ఉంది. ఎంత మోతాదులో జిప్సమ్ వాడాలో తెలుస్తుంది.
- దీని వల్ల తక్కువ ఖర్చుతో పొలం సాగు చేసుకుని అధిక దిగుబడులు పొందడానికి వీలుంటుంది. మొదటగా పొలాన్ని మళ్లుగా చేసుకుని మళ్ల నుంచి నీరు పోయే విధంగా కాల్వలను ఏర్పాటు చేసుకోవాలి. జిప్సమ్ నేలపై చల్లి మట్టితో కలిసేలా పైపైన నాగలితో దున్నాలి.
- తర్వాత నీటిని నిల్వ చేసి నేలలో ఇంకేలా చేయాలి. ఒక వారం రోజులు వరుసగా నీటిని మడిలో నిల్వ ఉంచాలి. ఎకరానికి రెండు టన్నుల కంటే ఎక్కువ జిప్సమ్ వేయాల్సి వచ్చినప్పుడు మొత్తం మోతాదును మూడు భాగాలుగా చేసి వరుసగా మూడేళ్లలో వేయాలి.
- నాణ్యత గల నీరు అందుబాటులో లేనప్పుడు రసాయనికంగా భూములు బాగు చేయడం ఆర్థికంగా గిట్టుబాటు కాదు. అలాంటి పరిస్థితుల్లో చౌడు గుణాన్ని తట్టుకోగల వరి, చెరుకు, పత్తి తదితర పంటలు వేయాలి. మరికొన్ని పంటల్లో యాజమాన్య పద్ధతులను అనుసరించాలి.
- బంక నేలలను లోతుగా దున్నాలి. ఇందు వల్ల ఉప్పును లోపలి పొరలోకి ఇంకింపజేయవచ్చు.
- చౌడులో పెరిగే పచ్చిరొట్ట పైర్లు ఎంపిక చేసుకోవాలి. నీరు సమృద్ధిగా ఉన్నప్పుడు వరి పైరును పంట మార్పిడిలో సాగు చేస్తే చౌడును బాగా తగ్గించవచ్చు.
- నత్రజని బాస్వరం, జింక్‌ను ఎక్కువ మోతాదులో వేయాలి. ఎక్కువ మోతాదు విత్తనాన్ని తక్కువ దూరంలో నాటాలి. పచ్చిరొట్ట వేయడం వీలుకాని సమయంలో సేంద్రియ ఎరువులను వేసి నీరు పెట్టాలి. చెరువు మట్టిని తోలించాలి.

భూసార పరీక్షలతో మంచి ఫలితాలు

రైతులు విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. కర్నూలు, నంద్యాల, ఎమ్మిగనూరు, డోన్‌లలో భూసార పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. భూసార పరీక్షలు చేయించడం వల్ల నేలలో ప్రధాన పోషకాలు, సూక్ష్మ పోషకాలు, చౌడు శాతం ఏ మోతాదులో ఉన్నాయో తెలుస్తుంది. ఇందుకు అనుగుణంగా రైతులు ఎరువులు, సూక్ష్మ పోషకాలు, అవసరమైన మేరకే వాడవచ్చు. చౌడు ప్రభావాన్ని తెలుసుకుని తదనుగుణంగా చర్యలు తీసుకోవచ్చు. భూసార పరీక్షల వల్ల రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. నేలలో చౌడు ప్రభావాన్ని తగ్గించుకునేందుకు వ్యవసాయ శాఖ ఏటా సబ్సిడీపై జిప్సమ్ సరఫరా చేస్తోంది. దీని ద్వారా రైతులు తమ భూముల్లో చవుడును నివారించుకోవచ్చు.